

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ

ప్రారంభమైన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

● నేడు స్వామివారి కల్యాణమహోత్సవం

కీసర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల పాటు జరిగే కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో నరేందర్ ఆధ్వర్యంలో వేద పాఠశాల పండితుడు గణపతిశర్మచే గణపతి పూజతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటిరోజు పూజల్లో భాగంగా ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులను కీసరలోని వంశపారంపర్యంగా వస్తున్న నివాస గృహంలోకి తీసుకెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు స్వామివార్ల ఉత్సవమూర్తులను పల్లకీసేవ ద్వారా కీసర గ్రామం నుంచి నడకదారి గుండా కీసరగుట్టకు తీసుకువస్తారు. శ్రవణ నక్షత్రయుక్త లగ్నంలో శ్రీ భవానీ శివదుర్గ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివార్ల కల్యాణమహోత్సవం నిర్వహిస్తారు.

కోటి రూపాయలు కేటాయింపు

బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం కోటి రూపాయలు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఎలాంటి అవసరం ఉన్నా ఆలయ నిర్వాహకులు, జిల్లా కలెక్టర్ సమన్వయం చేసుకొని నిధులు వినియోగించుకోవడం జరుగుతుంది.

● ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన సత్రాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.



టీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్, ఫెడరేషన్ ప్రతినిధులు

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి కృషి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలో తాను శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) డైరీ-2024ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై తాను చొరవ తీసుకుని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, కార్యదర్శులు సలీమా, గుడిగ రఘు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణ



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌యూజే ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలు ఇస్తామని సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తుందన్నారు. హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) డైరీని బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ రాజశేఖర్, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, రాధిక, రాష్ట్ర నాయకులు రామకృష్ణ, హెచ్‌యూజే ఉపాధ్యక్షులు బి.దామోదర్, నాగవాణి, రమేష్, వీరేష్, విజయ, ప్రశాంత్ పాల్గొన్నారు.

గాంధీలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్స

అడ్డగుట్ట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి చరిత్రలో ఎనిమిదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్ర చికిత్సను చిన్నపిల్లల వైద్యుల బృందం విజయవంతంగా చేసింది. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బైరాంగూడకు చెందిన మైథిలీ(8) కొంతకాలంగా దగ్గు, తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు అనేక ఆస్పత్రుల్లో వైద్యం చేయించారు. తగ్గకపోవడంతో ఈనెల 1న గాంధీ ఆస్పత్రిలోని చిన్నపిల్లల విభాగంలో చేర్పించారు. వైద్యులు చిన్నారికి ఎంఆర్ఐ టెస్టులతో పాటు వైద్య పరీక్షలు చేయించారు. చివరికి ఎమ్మారైలో బ్రాంకో జెనిక్ సిస్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. కేసు సవాల్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావుతో పాటు గాంధీ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎస్.శ్రీనివాస్, మనోజ్, ఆశ్రిత్‌రెడ్డి, హర్ష, నాగార్జునతో కూడిన వైద్య బృందం శస్త్ర చికిత్స చేసి చిన్నారికి ఉపశమనం కల్పించారు.



ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ రవిగుప్తా

18 నుంచి అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ : డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ 16వ అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అతిథ్యమిస్తోందని డీజీపీ రవిగుప్తా తెలిపారు. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 18 నుంచి 21 వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణ ఏర్పాట్లకు సంబంధించి తన కార్యాలయంలో సీనియర్ అధికారులతో కలిసి డీజీపీ రవిగుప్తా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి మొత్తం 440 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 24 జట్లు పోటీ పడతాయని, నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో సుమారు 745 మ్యాచ్‌లు జరుగుతాయని డీజీపీ వెల్లడించారు. అదనపు డీజీపీలు అభిలాషా బిస్త్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, విక్రమ్ సింగ్ మాన్, స్టీఫెన్ రవీంద్ర, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐజీ ఎం.రమేష్ ఇతర కీలక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాల్సిందే

● మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే



జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్, నాయకులు

పి.సబితారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్రీ ఎల్ఆర్ఎస్ డిమాండ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ బడంగ్‌పేట్‌శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో సబితారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సబిత మాట్లాడుతూ గతంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉచిత ఎల్ఆర్ఎస్‌ను డిమాండ్ చేయడమే కాకుండా తాము అధికారంలోకి వస్తే ఉచితంగా అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవిందశర్మ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ జడ్సీ కార్యాలయం ఎదుట

ఎల్బీనగర్ : ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికల హామీలలో చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ఆర్ఎస్ పేరిట వేలకోట్లు ప్రజల నుంచి రాబట్టుకోవాలనుకుంటున్నదని ఎమ్మెల్యే దేవి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రెడ్డి సుధీర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నయాపైసా ఖర్చు లేకుండా ఎల్ఆర్ఎస్‌ను పూర్తిగా ఉచితంగా చేస్తామని నేడు ప్రజల నడ్డివిరిచేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, భవానీ ప్రవీణ్, సాగర్‌రెడ్డి, పద్మానాయక్, గజ్జల మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసాగర్, నర్సింహ, ఇంద్రాజీ, వరప్రసాద్‌రెడ్డి, రాజిరెడ్డి, చిరంజీవి, అరవింద్ పాల్గొన్నారు.

'నారీ శక్తివందన్'పై మోదీ ప్రసంగాన్ని విన్న బీజేపీ శ్రేణులు

వనస్థలిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించేందుకు ఏర్పాటు చేసిన 'నారీ శక్తివందన్' కార్యక్రమంపై ప్రధాని మోదీ వర్చువల్‌గా చేసిన ప్రసంగాన్ని బీజేపీ మహిళా మోర్చా నాయకులు ఆలకించారు. నారీ శక్తి వందన్ ఎల్బీనగర్ ఇన్‌చార్జి కాలంశెట్టి లయ ఆధ్వర్యంలో నాగోల్‌లోని పీఎంఆర్ కన్వెన్షన్‌లో బుధవారం స్ర్కీన్ ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో హాజరైన మహిళా నాయకులు, కార్యకర్తలు మోదీ ప్రసంగాన్ని విన్నారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ నేత ఈటల రాజందర్ సతీమణి జమున, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు చింతల అరుణాసురేందర్‌యాదవ్, పవన్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాదూరి కరుణ, నందికొండ గీతారెడ్డి, కొప్పుర శ్యామల, బండారు శైలజ, కేశిరెడ్డి పద్మారెడ్డి, రాధిక, సరస్వతి పాల్గొన్నారు.



మోదీ ప్రసంగాన్ని వింటున్న మహిళలతో ఈటల జమున, సామ రంగారెడ్డి తదితరులు



మహిళా సాధికారతపై పీఎం నరేంద్రమోదీ ప్రసంగాన్ని తెరపై వీక్షిస్తున్న మహిళలు

అబ్దుల్లాపూర్‌మెట్ : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ మండల మోర్చా అధ్యక్షురాలు బోడిగె సురేఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శివ గార్డెన్‌లో నారి శక్తి అభియాన్ (మహిళ సాధికార సదస్సు) నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్ర్కీన్‌లో 10 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అమలు చేసిన పథకాలను పీఎం నరేంద్ర మోదీ వివరించారు. మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున హాజరై స్ర్కీన్‌లో మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, ఆ పార్టీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చిరెడ్డి, రాములుయాదవ్, పాపయ్యగౌడ్, గోవర్ధన్‌గౌడ్, అర్జున్, బొడిగె రమాదేవి, మీనాక్షి, శ్రీలత, శ్రావన్‌చారి, సురేష్ గౌడ్, రామకృష్ణ, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డీఎం హరి

చాదర్‌ఘాట్. మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ హరి అన్నారు. బుధవారం రాత్రి ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కండక్టర్లను, సిబ్బందిని, ప్రయాణికులను ఆయన ఘనంగా సన్మానించారు. హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న ప్రభ, దిల్‌సుఖ్‌నగర్ లా కళాశాల ప్రిన్సిపాల్ మానస, సరూర్‌నగర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వసుందర, జూనియర్ లెక్చరర్ భవానీ తదితరులు ముఖ్యఅతిథులుగా విచ్చేసి మహిళా కండక్టర్లు విధి నిర్వాహణలో ఎదుర్కొంటున్న ఒత్తిడిని గుర్తు చేసి ప్రశంసించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ వెంకన్న, ఎంఎఫ్ వెంకటేశ్, సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్-2 డిపోలో..

దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్టీసీ హైదరాబాద్-2 డిపోలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా కండక్టర్లు, సిబ్బందికి బుధవారం ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు డిపో మేనేజర్ కృష్ణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రజినీ, అసిస్టెంట్ మేనేజర్ ఉషశ్రీ, ఎంఎఫ్ శంకర్ పాల్గొన్నారు.



ఆర్టీసీ మహిళా కండక్టర్లను, సిబ్బందిని సన్మానిస్తున్న డీఎం హరి

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ డాక్టర్స్‌కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కాలనీ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ లింగారెడ్డి, ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని పిలుపునిచ్చారు. మహిళా మండలి సభ్యులు కేక్ కట్ చేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు కల్వకుంట్ల మమత అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో ఉపాధ్యక్షురాలు వక్కలంక అన్నపూర్ణ, కామినేని రామలక్ష్మి, వీరవల్లి జ్యోతి, ప్రధాన కార్యదర్శి తోడేటి సరిత, కోశాధికారి అడ్డు నిత్య, సంయుక్త కార్యదర్శి సుగురు సంధ్య పాల్గొన్నారు.



మహాశివరాత్రిని పురస్కరించుకుని మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని చారిత్రక ఆలయాలైన వీరన్నగుట్ట, భద్రకాళి రామలింగేశ్వరస్వామి ఆలయాలను సందర్శించాలని కోరుతూ బుధవారం మన్సూరాబాద్ కార్పొరేటర్లు ఆయా దేవాలయాల కమిటీ నిర్వాహకులతో కలిసి ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు.
- హయత్‌నగర్ ఆంధ్రజ్యోతి

బాధ్యతల స్వీకరణ

కొత్తపేట : ఎల్బీనగర్ పీఎస్ నూతన డీఐగా సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన ఎల్బీనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఎల్బీనగర్ డీఐగా పనిచేసిన వీరాస్వామి కుషాయిగూడ పీఎస్‌కు బదిలీ అయ్యారు.

నేషనల్ హాకీ టీంకు మీనా ఎంపిక

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న పి. మీనా ఈ నెల 14న పూనేలో జరుగనున్న హాకీ సీనియర్ ఉమెన్స్ నేషనల్‌కు తెలంగాణ నుంచి ఎంపికయింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నప్రభ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, లెక్చరర్లు జహేదా బేగం, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ మీనాను అభినందించారు.

పరీక్ష సామగ్రి అందజేత

ఎల్బీనగర్ : పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు టీం మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రి బాక్స్‌లు అందజేశారు. నాగోల్, కొత్తపేట, మన్సూరాబాద్, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హస్తినాపురం, ఎల్బీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఎంఆర్ఆర్‌టీం తరఫున ఉచితంగా ప్యాడ్‌లు, జామెట్రి బాక్సులు అందజేసినట్లు యువజన కాంగ్రెస్ నాయకుడు పన్నాల జైపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సాయిరాం, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, మహిపాల్‌రెడ్డి, యుగంధర్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కోహెడ ప్రభుత్వ పాఠశాలలో మాక్‌పోలింగ్

హయత్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఒక సర్పంచ్ స్థానానికి ఆరుగురు పోటీ పడగా 5 వార్డు స్థానాలకు 25 మంది పోటీలో నిలబడ్డారు. బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఓటు హక్కు కల్పించారు. వరుస క్రమంలో విద్యార్థులు పోలింగ్ కేంద్రానికి హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోటీలో గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థికి ధ్రువీకరణ పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దన్నెరాజు, నరసింహ, జగన్‌రాజు, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, కొండయ్య, రాధా మాధవి, చారి, మంజుల, అశోక్, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.



విద్యార్థులు నిర్వహిస్తున్న మాక్‌పోలింగ్

దంత సంరక్షణకు వైద్యుల సూచనలు పాటించాలి

కొత్తపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ చిన్నారుల దంత సంరక్షణకు తల్లిదండ్రులు వైద్యుల సూచనలు పాటించాలని ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి డా.అనిరుధ్ మాథుర్, వైద్యులు డా.ఎన్‌కేఎస్ అరవింద్, డా.సిరి చందన తెలిపారు. మార్చి 6న జాతీయ దంత వైద్యుల దినోత్సవ వేళ కొత్తపేట మోహన్‌నగర్‌లోని చిన్నారుల ఆరోగ్య, వైకల్యాల అధ్యయన సంస్థ - మానసలో ప్రత్యేక పాఠశాల దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకూ, మానస సిబ్బందికీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. పలువురికి దంత పరీక్షలు నిర్వహించారు. తర్వాత వైద్యులు ఫ్లోరోసిస్, ప్రయోరియా తదితర దంత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ మెర్సీ మధురిమ, ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి అలీపాషా

ప్రధాన కార్యాలయానికి సరెండర్

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్‌కే అలీపాషా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని పేర్కొంటూ బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అలీపాషాను డీటీసీపీ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. కొంత కాలంగా టీపీఎస్ అలీపాషాపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్నాయని కమిషనర్ తెలిపారు. విధులకు సక్రమంగా హాజరు కావడం లేదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యాయత్నం

చాదర్‌ఘాట్. మార్చి 6(ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, మామల వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స కోసం ఆమెను బంధువులు శాలివాహననగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆగ్రహించిన భర్త స్నేహితులతో వచ్చి దాడి చేసి వీరంగం సృష్టించాడు. బాధితురాలి కుటుంబీకులు మలక్‌పేట పోలీసులను ఆశ్రయించగా ఫిర్యాదు తీసుకోవడానికి నిరాకరించారు. పైగా వారి పైనే కేసు నమోదు చేస్తామని బెదిరించినట్టు సమాచారం. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట జిల్లాకు చెందిన బుర్ర తిరుమలేష్(27) బంధువైన ఊహను నాలుగేళ్ల క్రితం ప్రేమ పేరుతో మోసం చేసి గర్భవతిని చేశాడు. అనంతరం ఆమెకు అబార్షన్ చేయించాడు. తరువాత పెద్దలు వీరికి వివాహం జరిపించారు. ఇష్టం లేకున్నా వివాహం చేశారన్న కోపంతో తిరుమలేష్, అతని తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఊహను వేధించేవారు. బాధలు భరించలేక ఊహ మంగళవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా తిరుమలేష్ స్నేహితులతో వచ్చి దాడి చేశాడు. తిరుమలేష్ నుంచి రక్షణ కల్పించాలని బాధితులు పోలీసులకు విజ్ఞప్తి చేశారు. చైతన్యపురి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తిరుమలేష్, ఊహ పెళ్లి నాటి చిత్రం

రోషన్‌దౌలా బస్తీలో కార్పొరేటర్ పర్యటన

చంపాపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా బస్తీలో బుధవారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని డ్రైనేజీలలో చేపట్టిన సిల్ట్ తొలగింపు పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్త, చెదారం డ్రైనేజీలలో వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్తీక్, బస్తీవాసులు పెంటయ్య, భీమ్‌రాజ్ పాల్గొన్నారు.



సిల్ట్ తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈటలకు ఆహ్వానం

చంపాపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 20నుంచి ప్రారంభం కానున్న 13వ వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి బుధవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వనస్థలీపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్నేహపురికాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి కాలనీలో వ్యర్థాల తరలింపు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను వివరించారు. కాలనీ అంతర్గత దారుల్లో ప్యాచ్ వర్క్ చేపట్టాలని, వ్యర్థాలను తొలగించే పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ రాంకీ, జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. కాలనీ ప్రతినిధులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

వనస్థలిపురం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులకు డ్రైనేజీ సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో బాలాజీ అపార్ట్‌మెంట్ వద్ద డ్రైనేజీ పొంగడంతో సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పైప్‌లైన్లను బుధవారం పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే నూతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు వేసి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిషోర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జలమండలి మేనేజర్ భవ్య, జయసింహ పాల్గొన్నారు.



కాలనీవాసుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ప్రభుత్వ స్థలాన్ని ప్లేగ్రౌండ్‌కు కేటాయించండి

సైదాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబే కాలనీలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పిల్లలకు ఆట స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని కోరుతూ ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ ఆధ్వర్యంలో బుధవారం బస్తీవాసులు సైదాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీవాసులు శ్రీను, భారతి, లక్ష్మి, జ్యోతి, కుమార్, జగత్, ఫాతిమా, ధనమ్మ, సరిత పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం

చంపాపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని పలువురు బీఆర్ఎస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మయ్య, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, నాయకులు మల్లేష్‌గౌడ్, బొంబాయి, చందూయాదవ్, జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

వాటర్, ఎలక్ట్రికల్ కార్మికుల కమిటీ ఎన్నిక

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో పని చేస్తున్న వాటర్ మన్స్ ఎలక్ట్రికల్ కార్మికుల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ పరిధిలోని కుంట్లూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా దానయ్య, రవి, ఉపాధ్యక్షులుగా ఈశ్వరయ్య, శేఖర్, సహాయ కార్యదర్శులుగా నరసింహ, స్వామి, కోశాధికారిగా శ్రీను, నరేష్, గౌరవ అధ్యక్షులుగా పాండుతో పాటు 17 మందితో కమిటీని ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులు

ఎల్బీనగర్ పీఎస్‌లో 'రెడీ టు సర్వ్' వైద్య శిబిరం

కొత్తపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్‌లో బుధవారం 'రెడీ టు సర్వ్' సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. వైద్య సాంకేతిక సిబ్బంది పోలీస్ సిబ్బందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి శివ, ఎస్‌హెచ్‌ఓ రామాంజనేయులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బాలికకు వేధింపులు

● యువకుడిపై పోలీసులకు కుటుంబ సభ్యుల ఫిర్యాదు

సరూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ బాలికకు మాయమాటలు చెప్పి వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. రాజేంద్రనగర్ అత్తాపూర్‌కు చెందిన ఓ బాలిక(16) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు(21) ఏడాది నుంచి బాలికను పరిచయం చేసుకుని వెంట పడుతూ ప్రేమ, పెళ్లి పేరుతో వేధింపులకు గురి చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పలుమార్లు యువకుడిని మందలించడమే కాకుండా రాజేంద్రనగర్ పీఎస్‌లోనూ ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు దీనిని సీరియస్‌గా తీసుకోకపోవడంతో మళ్లీ బాలిక వెంట పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మరోసారి బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లో నుంచి తీసుకెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించగా మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీకేఆర్ కాలేజీ కమాన్ వద్ద ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లగా వారిని చూసిన యువకుడు పారిపోయాడు. బాలిక కుటుంబ సభ్యులు అతడిపై మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.